భయం భయంగా విధులు

- శిథిలావస్థలో కేశవపట్నం పోలీస్ స్టేషన్, క్వార్టర్లు
- వర్షాకాలంలో ఉరుస్తున్న భవనాలు
- పెచ్చులూడి పడుతుండటంతో ఇబ్బంది పడుతున్న పోలీసులు



శిథిలావస్థలో పోలీస్ స్టేషన్

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్ స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంది. 1986లో నిర్మించిన భవనం కావడంతో ఏటా వానాకాలంలో ఉరుస్తుంది. నిజాం కాలంలో పోలీస్ స్టేషన్ తాడికల్‌లో ఉండగా తదనంతరం కేశవపట్నంకు మార్చారు. మొదట్లో గ్రామంలోని అద్దె ఇంటిలో పోలీస్‌స్టేషన్ కొనసాగింది. కేశవపట్నం మాజీ ఎంపీపీ గాజుల శంకరయ్య సొంత భూమిని ఇవ్వడంతో ప్రభుత్వం పోలీస్‌స్టేషన్‌ను నిర్మించింది. కేశవపట్నం ప్రధాన రోడ్డు పక్కన సర్వే నంబర్ 501, 502లోని పది గుంటల స్థలాన్ని శంకరయ్య విరాళంగా ఇచ్చారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా మొలంగూర్ శివారులోని మక్త గ్రామానికి చెందిన సీలింగ్ భూమి సర్వే నంబర్ 753లోని ఇరవై గుంటల స్థలంలో రాజాపూర్ మాజీ సర్పంచ్ చింతిరెడ్డి లింగారెడ్డి ప్రభుత్వ మంజూరు చేసిన నిధులతో పోలీస్‌సిబ్బంది కోసం క్వార్టర్లు నిర్మించారు. గతేడాది నుంచి పోలీస్‌స్టేషన్ తోపాటు క్వార్టర్లు ఉరుస్తున్నాయి. దీంతో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండటంతో పోలీస్ స్టేషన్‌ను అద్దెభవనంలోకి మార్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు పోలీస్ సిబ్బంది క్వార్టర్స్‌లో ఉండటానికి ఇష్టపడటంలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. తాత్కాలికంగా అద్దెభవనంలోకి మార్చిన నూతన పోలీస్‌స్టేషన్, క్వార్టర్ల నిర్మాణం కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.



పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా నిర్మించిన క్వార్టర్లు



సైదాపూర్: వెన్నంపల్లిలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పుస్తకాల పంపిణీ

చొప్పదండి: చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాల , పాలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం చాక్లెట్స్, బెలూన్స్, రంగోలీలతో ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల విద్యాధికారి మధుసూదనాచారి, హెచ్‌ఎం డి. శ్రీనివాస్ గురువారం దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా టపాసులు పేల్చారు. స్వీట్లు పంపిణీ చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సైదాపూర్: వెన్నంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం తొలిరోజే పాఠ్యపుస్తకాలు అందించిందని, సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మధ్యాహ్న భోజనం, ఉచిత దుస్తులు, నైపుణ్యం గల ఉపాధ్యాయులతో విద్యా బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే లభ్యమవుతుందన్నారు. అనంతరం పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పిల్లలను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫాం మత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్, మాజీ ప్రజాప్రతినిధులు మల్లారెడ్డి, కిషన్‌రావు, సర్వ తిరుపతి, పాఠశాల చైర్మన్ జరీనా, తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్‌లో..



శంకరపట్నం: కొత్తగట్టులో

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలి



గంగాధర: మాట్లాడుతున్న పవన్‌కుమార్

గంగాధర: అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను వెంటనే ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని మండల ప్రత్యేకాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పలు గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఏళ్లుగా కొనసాగుతున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో దమ్మని రాము, ఎంపీవో గౌరి రమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక, హౌజింగ్ ఏఈ యశ్వంత్, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని మండల ప్రత్యేకాధికారి చత్రూనాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో 15 అద్దెభవనాల్లో కొనసాగుతుండగా వీటిలో ఆరు అంగన్‌వాడీ భవనాలకు మార్చగా మిగతావాటిని ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రిష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

డాక్టర్ భూంరెడ్డికి నివాళి



నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు, తదితరులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ చావడి వద్ద ఇటీవల మృతి చెందిన ప్రముఖ వైద్యుడు భూంరెడ్డికి గ్రామస్తులు నివాళి అర్పించారు. వైద్యుడిగా భూంరెడ్డి చేసిన సేవలు ఎప్పటి మరిచిపోలేమని, ఆయన మృతి వైద్య రంగానికి తీరని లోటు అని ఎల్ఐసీ కరీంనగర్‌శాఖ మేనేజర్ భీరెడ్డి ప్రేమ్ సాగర్‌రెడ్డి, రెడ్డి సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ నారాయణ, మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, రెడ్డి సంఘాల ఐక్య వేదిక రామడుగు మండల అధ్యక్షుడు లచ్చిరెడ్డి, సంఘం నాయకులు భూంరెడ్డి, రాల్లబండి శ్రీనివాస్‌రెడ్డి, పుర్మాణి శ్రీనివాస్‌రెడ్డి, గిరి శ్రీనివాస్‌రెడ్డి, దొడ్డ లచ్చిరెడ్డి, కాసార్ల లచ్చిరెడ్డి, బాపురెడ్డి, సత్యనారాయణరెడ్డి, అమరేందర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, మల్లారెడ్డి, ఆర్‌ఎంపీ ఆంజనేయులున్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి బాధాకరం



పాడె మోస్తున్న చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామంలో మాజీ ఎంపీటీసీ, సీపీఐ నాయకురాలు చాడ శోభ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం రేకొండలో నిర్వహించిన శోభ అంత్యక్రియల్లో చాడ వెంకట్‌రెడ్డి పాల్గొని, నివాళులు అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి, సిద్దిపేట్, కరీంనగర్ జిల్లాల కార్యదర్శులు మంద పవన్‌కుమార్, పంజాల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందెస్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

చిగురుమామిడి: మండలంలోని రామంచ మోయతుమ్మెద వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం కొందరు అడ్డుకున్నారు. ప్రభుత్వం కేటాయించిన పట్టా భూముల్లోంచి ఇసుక తోడేస్తున్నారని, దీంతో వ్యవసాయం చేసుకోలేకపోతున్నామని, వాగు మధ్యలో నుంచి ఇసుక తీయాలన్నారు. అడ్డుకున్న వారిలో నర్సింహులు, సారయ్య, స్వామి, పవన్, సంపత్, కృష్ణ ఉన్నారు.

పెట్రోల్‌బంక్ సీజ్

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి శివారులో నిర్మిస్తున్న జియో పెట్రోల్‌బంక్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి పద్మలత సీజ్ చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్నారని యజమానులకు మూడుసార్లు పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చారు. నోటీసులను బేఖాతరు చేయగా గురువారం బంక్ సీజ్ చేశారు.

దరఖాస్తులు ఆహ్వానం



చిగురుమామిడి: మండల కేంద్రంలోని కేజీబీవీలో నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుజాత గురువారం ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసైనవారు 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. చిన్నముల్కనూర్‌లోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్‌గా పనిచేసేందుకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని, ఏడో తరగతి పాసైన వారు అర్హులని ప్రిన్సిపాల్ తెలిపారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికలు



నూతన డైరెక్టర్లతో పాలకవర్గ సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో గురువారం కరీంనగర్ డైయిరీ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం ఆవరణలో నూతన డైరెక్టర్లుగా కొత్త తిరుపతి, కానవేని తిరుపతి, జేరిపోతుల సింగరయ్యను సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రూట్ సూపర్‌వైజర్ సీత రవి మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అభివృద్ధి, పాల దిగుబడి కోసం పాలకవర్గంతో పాటు సభ్యులు పనిచేయాలన్నారు. డైయిరీ నుంచి అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో అధ్యక్షులు పత్తేం రవీందర్ తో పాటు రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

జమ్మికుంటరూరల్: మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామంలో తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా భూ సమస్యలపై 161 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐలు సత్యనారాయణ, శంకర, ఎంపీఎస్‌వో, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

తిర్మలాపూర్‌లో..

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్‌లో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. 112 మంది రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారని తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వీయ పరీక్ష తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌క్రైం: మహిళలు స్వీయ పరీక్ష ద్వారా రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించవచ్చని, తద్వారా ప్రాణాపాయ ముప్పు తగ్గించవచ్చని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సనా చారిటబుల్ ట్రస్ట్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కమిషనరేట్‌లోని పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్, మున్సి పల్ మహిళా సిబ్బందికి నిర్వహించిన ఉచిత క్యాన్స ర్ నిర్ధారణ శిబిరాన్ని సందర్శించారు. మహిళ ఆ రోగ్యంగా ఉంటేనే కుటుంబం, తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పోలీస్ కమి షనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ సనా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ వాజ్‌పేయ్ మాట్లాడుతూ 800 మంది మున్సిపల్ కార్మికులతో పాటు సుమారు 1500 మంది మహిళా సిబ్బందికి వివిధ రకాల క్యాంపుల ద్వారా ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. సనా ఛారిటబుల్ ట్రస్ట్ స్థాపకులు సత్తయ్య, కోఆర్డినేటర్ సురభి నర్సమ్మ, ఎంఎన్‌జే వైద్యులు ప్రణయ్, సుస్మితరెడ్డి పాల్గొన్నారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు

కరీంనగర్‌రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో గురువారం రేకుర్తి కంటి ఆస్పత్రిలో హన్మయ్య, భారతి, లస్మమ్మ, ఐలయ్య, లక్ష్మిలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఇప్పటివరకు 163మంది రోగులకు ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. అనంతరం రోగులకు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ జోన్ చైర్‌పర్సన్ చింతల కిషన్ పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు

హుజూరాబాద్‌రూరల్: రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని లబ్ధి పొందాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర రావు అన్నారు. గురువారం హుజూరాబాద్‌లోని రైతు వేదికలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించామన్నారు. సంపన్న రైతు దేశానికి గర్వ కారణం అనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని మే 29 నుంచి జూన్ 12 వరకు నిర్వహించామని, వ్యవసాయ అనుబంధ రంగాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరించామన్నారు. వ్యవసాయ రంగంలో సమస్యలు, పరిష్కార మార్గాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డా. శ్రీధర్,డా.అవినాశ్, లింగం, హైదరాబాద్ ఎన్ఏఏఆర్ఎం శాస్త్రవేత్త, డా. సువర్ణ, జి. వేణు గోపాల్ ఆయిల్‌పామ్, అంతర పంటల సాగు, పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు పొద్దుటూరి సతీశ్‌కుమార్ రెడ్డి, నిఖిల్ కుమార్, స్రవంతి రైతులు పాల్గొన్నారు.

సంస్కృతికి నిలయాలు 'శిశు మందిరాలు'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

జమ్మికుంట: సరస్వతి శిశు మందిరాలు, విద్యాపీఠాలు దేశ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ నూతన భవనాన్ని ప్రారంభించారు. శిశు మందిరాలు పూర్వ విద్యార్థులు, పోషకులు ఆధారంగా విద్యతో పాటు అభివృద్ధిని సాధిస్తున్నాయని, కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం కొమురయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హేమలత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, చదువు కిరణ్‌కుమార్‌రెడ్డి, అకుల రాజేందర్, ముక్క జితేందర్ గుప్తా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిబిరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని వెదిర గ్రామం అల్ఫోర్స్ స్కూల్‌లో పది రోజుల పాటు నిర్వహించిన ఎన్‌సీసీ శిబిరం గురువారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. శిక్షణలో ప్రతి విద్యార్థి పాల్గొనాలని అప్పుడే దేశ భద్రతపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ కమాండర్ సునీల్ అబ్రహం, కల్నల్ ఏకే జయంత, అడ్మిన్ ఆఫీసర్ కృష్ణ పలువురు పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ శంకర్ అధ్యక్షతన ఫైనలియర్ విద్యార్థులకు గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రయోగాత్మక నైపుణ్యాలను పెంపొందించుకుంటే అద్భుతమైన భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కల్లెం రవీంద్రబాబు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ అనిల్, ఈఈఈ డీన్ డాక్టర్ యోగేశ్ పుండలిక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం వివాదంపై ఎంపీడీవో విచారణ



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో కృష్ణప్రసాద్

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో ఇంటి స్థలం వివాదంపై గురువారం ఎంపీడీవో కృష్ణప్రసాద్ విచారణ చేశారు. గ్రామానికి చెందిన ఒంటరి మహిళ కత్తుల రామక్కకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఇంటి స్థలం తనదేనని మల్లారెడ్డి అనే వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంజూరైన ఇల్లు రద్దయింది. దీంతో మహిళ ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా విచారణ చేయాలని అదనపు కలెక్టర్ శంకరపట్నం ఎంపీడీవోను ఆదేశించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అభ్యంతరం చెప్పిన మల్లారెడ్డి, రామక్కతోపాటు కొంతమంది గ్రామస్తులను విచారించారు. పూదరి తిరుమల్ నుంచి ఇంటి స్థలం కొనుగోలు చేశామని, అంతకు ముందు మల్లారెడ్డి అనే వ్యక్తి తిరుమల్‌కు విక్రయించినా సాదాబైనామా పత్రాలను రామక్క ఎంపీడీవోకు అందజేశారు. తాత్కాలికంగా రేకుల షెడ్డులో నివసిస్తున్నానని వివరించగా ఆమె నివాసాన్ని పరిశీలించారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు.

వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం



ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

జమ్మికుంట: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు వైద్యం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, నాయకులతో కలిసి సందర్శించారు. అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి స్థాయికి తగ్గట్టు వైద్యుల నియామకం, పరికరాలు, ఇతర సమస్యలు అనేకం ఉన్నాయని, రోగులకు సరైన వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీకాంత్‌రెడ్డి నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకుపోయి ఆసుపత్రిలో పరికరాల ఏర్పాటుకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజేందర్, రమారెడ్డి, అప్పం మధు, గణేశ్, పల్లపు రవి, మోతె స్వామి, అశోక్, శ్రీపర్తి ప్రవీణ్, చందు, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పద అలా నడిచొద్దాం' పుస్తకం ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: కవయిత్రి సరసిజ రచించిన 'పద అలా నడిచొద్దాం' పుస్తకాన్ని బుధవారం రాత్రి కరీంనగర్‌లోని కవి పెనుగొండ బసవేశ్వర్ ఇంటిపై తెలంగాణ రచయిత వేదిక ఆధ్వర్యంలో జరిగిన 146వ ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమంలో బహుభాషావేత్త నలమెల భాస్కర్ ఆవిష్కరించారు. సీవీ కుమార్ పుస్తక సమీక్ష చేయగా కవులు శంకరయ్య, దేవేందర్,నాగభూషణం, వెంకటేశ్వర్లు, తిరుపతి, రవీందర్, రమణయ్య, నిర్మలరాణి, అనిత పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అభ్యంతరాల పరిశీలన

కరీంనగర్ కార్పొరేషన్: డివిజన్ల పునర్విభజనపై వచ్చిన అభ్యంతరాలపై నగర పాలక సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈనెల 11వ తేదీతో అభ్యంతరాల స్వీకరణ ముగియగా గురువారం నుంచి 16వ తేదీవరకు అభ్యంతరాల పరిశీలించి, పరిష్కరించనున్నారు. ఇందులో భాగంగా గురువారం నగరపాలకసంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ కిసాన్‌నగర్‌లో క్షేత్రస్థాయిలో ఇంటి నంబర్లు, ఓటర్ల సంఖ్య, డివిజన్ల హద్దులు పరిశీలించారు.

క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి

వీణవంక: ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని లోహియ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్ పట్నాయక్, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని ఘన్ముక్కుల గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై గోద్రేజ్ కంపెనీ, లోహియ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. పంట సాగు చేసిన గుడిపాటి శివారెడ్డి, నందికొండ మల్లారెడ్డి, మాధవరెడ్డిని ఘనంగా సన్మానించారు. పంట సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని అదే విధంగా అంతర పంటలు వేసుకోవడానికి రూ.4,200 అందిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. పంట పండిన తర్వాత మార్కెటింగ్ చేసే బాధ్యత తీసుకునేందుకు గ్యారంటీ కార్డు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తాడిచెర్ల కొంరయ్య, మార్కెట్ డైరెక్టర్ రషీద్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వం

వీణవంక: రైతుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కుల సంపత్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. రెండు పంటలకు పూర్తి స్థాయిలో రైతు భరోసా అందివ్వకుండా కాలయాపన చేయడం బాధాకరమని, గత యాసంగికి నాలుగు ఎకరాలలోపు ఉన్న రైతులకు మాత్రమే రైతుభరోసా డబ్బులు జమచేశారని, ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ అమలుచేయడం లేదన్నారు. మాట తప్పడంతో పాటు రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని, ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, తులం బంగారం ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు.

నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుతున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి కార్మిక, గనులశాఖ కేటాయించడాన్ని హర్షిస్తూ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సొల్లు బాబు, ఎడ్ల విజయ్ కుమార్, వేముల పుష్పలత, సొల్లు సునీత, జూపాక మల్లేశ్వరి, కాందారి కృష్ణారావు, పసుల స్వామి తదితరులున్నారు.

ప్రొసీడింగ్స్ పంపిణీ



లబ్ధిదారుడిని సన్మానిస్తున్న ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక, సింగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ ప్రొసీడింగ్స్ అందజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, ఇచ్చిన హామీలు అమలు చేయనుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం కొనసాగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

గణేశ్‌నగర్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

హుజూరాబాద్: మున్సిపల్ పరిధి రెండో వార్డులోని గణేశ్‌నగర్‌లో గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య తెలిపారు. కాలనీలోని రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. వరదనీరు రోడ్లపైకి రాకుండా మురుగుకాలువల్లో పేరుకుపోయిన సిల్టు, మట్టిని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆర్. భూపాల్‌రెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జి. సాంబరాజు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్. సుధాకర్, సీనియర్ సహాయకులు జె. శ్రీకాంత్, జూనియర్ సహాయకులు రవీందర్, రాజయ్య, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ పి. వినయ్ తదితరులున్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

రామడుగు: మండల కేంద్రంలో గురువారం బీజేపీ రామడగు మండల అధ్యక్షుడు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో మండల కార్యశాల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి నాయకుడు దుబాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీఎం మోదీ పాలనపై ప్రతి గ్రామంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, కార్యవర్గ సభ్యులు ఉప్పు శ్రీనివాస్, మండల మాజీ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, నాయకులు పోచంపల్లి నరేష్, శ్రీకాంత్‌గౌడ్, జిట్టవేని అంజిబాబు, రవీందర్, రమేష్ పాల్గొన్నారు.